సంపుటి :02 సంచిక :298 పేజీలు :05 వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com Voice of the people

గురువారం 05, ఫిబ్రవరి 2026



# మేడారంపై సీఎంవో నజర్

- సీఎంఓ ప్రిన్సిపల్ సెక్రటరీ క్షేత్రస్థాయి పరిశీలన
- కలెక్టర్, ఎస్పీలతో కలిసి వీవీఐపీ రూట్, పార్కింగ్ స్థలాల తనిఖీ
- లోటుపాట్లపై ఆరా

03




# త్రిముఖ పోటీ!

## పరకాల మున్సిపాలిటీలో తలపడుతున్న కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ

అనేక పోరాటాలకు గడ్డ.. రాజకీయాలకు అడ్డా అయిన పరకాలలో ఇప్పుడు 'పుర'పాలక రాజకీయం సెగలు పుట్టిస్తోంది. ఇక్కడ జరుగుతున్నది వార్డు కౌన్సిలర్ల ఎన్నిక మాత్రమే కాదు.. ముగ్గురు ఉద్దండుల మధ్య జరుగుతున్న అలిఖిత 'యుద్ధం'. ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డికి ఇది ప్రతిష్ట.. మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి ఇది ఉనికి చాటుకునే సవాల్.. ఇక బీజేపీ నేత కాళీ ప్రసాద్ రావుకు ఇది ఉనికిని చాటుకునే అగ్నిపరీక్ష. మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకునేందుకు ఈ ముగ్గురు నేతలు వేస్తున్న ఎత్తులు, వేస్తున్న పైఎత్తులతో పరకాల రాజకీయ చదరంగం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది.

- అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి

02


- తమ పార్టీ అభ్యర్థుల గెలుపును భుజాన వేసుకున్న ఆ ముగ్గురు నేతలు
- క్షేత్రస్థాయి ప్రచారంలో ప్రత్యర్థుల వైఫల్యాలపై విమర్శనాస్త్రాలు
- శ్రేణుల చేరికలతో వార్డుల్లో మారిన రాజకీయ సమీకరణలు
- గడపగడపకు వెళ్లి ఓటర్లను కలుస్తున్న అభ్యర్థులు
- మెజారిటీ వార్డుల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య ప్రధాన పోటీ
- విజయంపై ప్రధాన పార్టీల్లో ఎవరి ధీమా వారిదే
- హీటెక్కిన ప్రచారం.. ఆసక్తి రేపుతున్న ఎన్నికలు
- పరకాల మున్సిపాలిటీ ముఖచిత్రం



# పుర పోరుకు సీఎం రేవంత్

- 8న కొడవటంచలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- చెల్పూరులో భారీ బహిరంగ సభ
- ఏర్పాట్లను పర్యవేక్షించిన ఎమ్మెల్యే సత్యనారాయణరావు

02



# ధాన్యంలో సివిల్ దందా

- భూపాలపల్లి జిల్లాలో వసూళ్ల పర్వం!
- ధాన్యం కేటాయింపుల్లో ఓ అధికారి హస్తవాటం.. 'లక్ష'ణంగా ముడుపులు
- రూపాయి పేరుతో వసూళ్లకు తెరలేపిన ఇద్దరు మిల్లర్లు
- ఓ డిఫాల్ట్ రైస్ మిల్లులో దిగిన ప్రభుత్వ ధాన్యం!

04

# మేడారం తల్లీ.. కానుకల వెల్లీ!

## తొలిరోజు హుండీ ఆదాయం రూ.2.49 కోట్లు

- టీటీడీ కల్యాణ మండపంలో లెక్కింపు ప్రారంభం
- మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా శ్రీకారం

03






# త్రిముఖ పోటీ

- పరకాల మున్సిపాలిటీలో తలపడు తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ
- తమ పార్టీ అభ్యర్థుల గెలుపును భుజాన వేసుకున్న ఆ ముగ్గురు నేతలు
- క్షేత్రస్థాయి ప్రచారంలో ప్రత్యర్థుల వైఫల్యాలపై విమర్శనాస్త్రాలు
- శ్రేణుల చేరికలతో వార్డుల్లో మారిన రాజకీయ సమీకరణలు
- గడపగడపకు వెళ్లి ఓటర్లను కలుస్తున్న అభ్యర్థులు
- మెజారిటీ వార్డుల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య ప్రధాన పోటీ
- విజయంపై ప్రధాన పార్టీల్లో ఎవరి ధీమా వారిదే
- హీటెక్కిన ప్రచారం.. ఆసక్తి రేపుతున్న ఎన్నికలు
- పరకాల మున్సిపాలిటీ ముఖచిత్రం

**అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి :**
ఉమ్మడి వరంగల్ లో పరకాలకు ఓ ప్రత్యేకత ఉంది. అనేక ఉద్యమాలకు ఊపిర్లూదిన ఈ గడ్డపై ప్రస్తుతం పురపోరు ఆసక్తి రేపుతుంది. మున్సిపల్ ఎన్నికల్లో ఇక్కడ తమ పార్టీ జెండా ఎగరవేసేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు పోటీ పడుతున్నాయి. ముఖ్యంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు ప్రతిష్టాత్మకంగా భావిస్తుండటంతో ఇక్కడ మున్సిపల్ ఎన్నికలు రసవత్తరంగా మారాయి. ప్రస్తుతం ఈ మూడు పార్టీల నేతలు విజయం కోసం వ్యూహ ప్రతి వ్యూహాలను అమలు చేస్తున్నారు. తమ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ఓట్ల వేటలో ముందుకు సాగుతున్నారు. పోటాపోటీగా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. గడపగడపకు వెళ్లి నేరుగా ఓటర్లను కలవడమే కాకుండా కార్నర్ మీటింగ్స్ లో పాల్గొంటున్నారు. తగ్గేదేలే అనే రీతిలో విమర్శల్లోనూ పోటీ పడుతున్నారు. ప్రధానంగా స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, గత అసెంబ్లీ ఎన్నికల్లో పరకాల నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన డాక్టర్ కాళీ ప్రసాద్ రావుకు ఈ మున్సిపల్ ఎన్నికలు సవాల్ గా మారాయని చెప్పవచ్చు. ఎందుకంటే పరకాల మున్సిపాలిటీలో తమ పార్టీ అభ్యర్థుల గెలుపును ఈ ముగ్గురు భుజాన వేసుకున్నారు. మెజార్టీ స్థానాల్లో తమ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవటమే టార్గెట్ గా దూసుకెళ్తున్నారు. ప్రచారంలో తమ పార్టీ అగ్ర నేతలనూ దింపుతున్నారు. దీంతో ఇక్కడ త్రిముఖ పోటీ నెలకొంది.

### - మెజారిటీ స్థానాల్లో..

పరకాల మున్సిపాలిటీ పరిధిలో 22 వార్డులు ఉన్నాయి. మొత్తం ఓటర్ల సంఖ్య 26,653. వీరిలో మహిళలు 13,433, పురుషులు13,216, ట్రాన్స్ జెండర్స్ 4గురు ఉన్నారు. ప్రతి వార్డు నుంచి కూడా పోటాపోటీగా నామినేషన్లు దాఖలు అయ్యాయి. 22 వార్డుల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, 21 వార్డుల్లో బీజేపీ అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. పరిశీలనలో నామినేషన్ తిరస్కరణకు గురికావడం వల్ల ఒక వార్డులో బీజేపీ నుంచి అభ్యర్థి బరిలో లేరు. బీజేపీ అభ్యర్థులు బరిలో ఉన్న 21 వార్డుల్లో 14వ వార్డ్ నుంచి బరిలో నిలిచిన అభ్యర్థి తాజాగా బీఆర్ఎస్ లో చేరారు. దీంతో బీజేపీ అభ్యర్థులు ప్రస్తుతం 20 వార్డుల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులతో తలపడుతున్నారు. ఫలితంగా వీటిలో త్రిముఖ పోరు జరుగుతుండగా 22 వార్డుల్లోనూ మెజారిటీ స్థానాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య నువ్వా నేనా అనే రీతిలో పోటీ నెలకొంది. శ్రేణుల చేరికలతో కొన్ని వార్డుల్లో రాజకీయ సమీకరణలు మారాయి. ఇక ఉమ్మడి వరంగల్ లో మరే మున్సిపాలిటీలో లేని విధంగా బీజేపీ ఎక్కువ వార్డుల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ కు గట్టి పోటీ ఇస్తున్నది పరకాల మున్సిపాలిటీలోనే కావటం గమనార్హం.

### - విమర్శనాస్త్రాలు

మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచే ప్రచారం మొదలైనప్పటికీ నామినేషన్ల ఉపసంహరణ తర్వాత మంగళవారం సాయంత్రం నుంచి ఊపందుకుంది. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉంటే మెజారిటీ స్థానాలను కైవసం చేసుకుని ఇక్కడ తమ పార్టీ జెండాను ఎగరవేయాలనే లక్ష్యంతో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నేతలు క్షేత్రస్థాయి ప్రచారంలో తలమునకలయ్యారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి కాంగ్రెస్, మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి బీఆర్ఎస్, బీజేపీ నేత కాళీ ప్రసాదరావు కమలం అభ్యర్థుల గెలుపు కోసం స్థానికంగా అడ్డా వేసి ఎత్తుకు పై ఎత్తులను అమలు చేస్తున్నారు. గెలుపే లక్ష్యంగా విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లలో పరకాల పట్టణం అభివృద్ధికి నోచుకోలేదని, అప్పట్లో ఎమ్మెల్యేగా ఉన్న చల్లా ధర్మారెడ్డి జిల్లాల పునర్విభజన సమయంలో స్థానికంగా లేకపోవడం వల్ల పరకాలకు తీరని అన్యాయం జరిగిందని ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి తన ప్రచారంలో విరుచుకుపడుతున్నారు. ఇదే సమయంలో గత రెండేళ్లలో తమ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రస్తావిస్తూనే ఇటీవల ఇక్కడ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు శంకుస్థాపన చేసిన విషయాన్ని స్థానికులకు గుర్తు చేస్తున్నారు. ఇక మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తన ప్రచారంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో పరకాలలో చేపట్టిన హాస్పిటల్, ఆర్డీఓ ఆఫీస్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం తదితర అభివృద్ధి పనులను ప్రజల వివరిస్తున్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ తో పరకాల అభివృద్ధి జరగలేదని, బీజేపీని గెలిపిస్తే కేంద్రం నుంచి అభివృద్ధి పనుల కోసం ఈ మున్సిపాలిటీకి నిధులు వస్తాయని డాక్టర్ కాళీప్రసాదరావు చెప్తున్నారు. ఈ క్రమంలో ఎవరికి వారే గెలుపు తమదేనని ధీమా వ్యక్తం చేస్తున్నారు. పోటాపోటీ ప్రచారం, నేతల విమర్శలతో పరకాలలో పొలిటికల్ వాతావరణం హీటెక్కింది.

# పుర పోరుకు సీఎం రేవంత్

- 8న కొడవటంచలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- చెల్పూరులో భారీ బహిరంగ సభ
- ఏర్పాట్లను పర్యవేక్షించిన ఎమ్మెల్యే సత్యనారాయణరావు



అక్షరదర్బార్, రేగొండ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈనెల 8న భూపాలపల్లి నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా రేగొండ మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొడవటంచ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వివిధ అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. అనంతరం గణపురం మండలం చెల్పూరు గ్రామ పంచాయతీ శివారులో నిర్వహించే భూపాలపల్లి మున్సిపల్ ఎన్నికల భారీ బహిరంగ సభలో ఆయన పాల్గొని ప్రసంగించనున్నారు.

### - యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు

ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు గురువారం రేగొండ మండలంలోని కొడవటంచ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. ఆలయ అభివృద్ధి పనులు, హెలీప్యాడ్ నిర్మాణం, వాహనాల పార్కింగ్ తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. భక్తులకు, సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులన్నీ నాణ్యతతో, నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను, అధికారులను ఆదేశించారు.

### - ప్రజా ప్రభుత్వం - ప్రగతి పథం

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం హయాంలో దేవాలయాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. కొడవటంచ ఆలయ పునరుద్ధరణ కోసం ప్రభుత్వం కేటాయించిన రూ.12.15 కోట్ల నిధులతో పనులు వేగంగా జరుగుతున్నాయని వివరించారు. ఈ పర్యటన కేవలం అభివృద్ధి పనులకే పరిమితం కాకుండా, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపుతుందని ధీమా వ్యక్తం చేశారు. చెల్పూరులో జరగబోయే సీఎం సభకు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.



# అభివృద్ధికి కట్టుబడి ఉంటా

- అధికార పార్టీతోనే అభివృద్ధి సాధ్యం
- 7వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి పావుశెట్టి సునీల్

అక్షర దర్బార్, పరకాల: అభివృద్ధికి కట్టుబడి ఉంటానని పరకాల మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ 7వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి పావుశెట్టి సునీల్ అన్నారు. గురువారం పరకాల పట్టణంలోని 7వ వార్డులో నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో ఆయన సీతారాంపురం కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలు సునీల్‌కు ఘన స్వాగతం పలుకుతూ ఆశీర్వదించారు. ప్రచారంలో మాట్లాడిన సునీల్ అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీతోనే పట్టణంతో పాటు వార్డు అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. 7వ వార్డును అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు కట్టుబడి ఉంటానని హామీ ఇచ్చారు. తనకు మద్దతుగా ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# మేడారం తల్లీ.. కానుకల వల్లీ!

- తొలిరోజు హుండీ ఆదాయం రూ.2.49 కోట్లు
- టీటీడీ కల్యాణ మండపంలో లెక్కింపు ప్రారంభం
- మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా శ్రీకారం

అక్షరదర్బార్, హనుమకొండ : దక్షిణ భారత కుంభ మేళాగా పేరుగాంచిన మేడారం సమ్మక్క–సారలమ్మ మహాజాతరలో భక్తులు సమర్పించుకున్న కానుకల లెక్కింపు ప్రక్రియ గురువారం అట్టహాసంగా ప్రారంభ మైంది. హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ జ్యోతి ప్రజ్వలన చేసి, కొబ్బరికాయ కొట్టి ఈ ప్రక్రియను అధికారికంగా ప్రారంభించారు.

## - మొదటి రోజు

లెక్కింపు ప్రారంభమైన మొదటి రోజున అధికారులు, వాలంటీర్లు కలిసి 125 హుండీలను లెక్కించారు. ఇందులో నగదు రూపంలో రూ.2,49,65,000 ఆదాయం సమకూరిందని అధికారులు వెల్లడించారు. భక్తులు సమర్పించిన బంగారం, వెండి ఆభరణాలను విడిగా భద్రపరిచారు. గత జాతరతో పోలిస్తే ఈసారి ఆదాయం గణనీయంగా పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

## - 788 హుండీలు.. కట్టుదిట్టమైన భద్రత

ఈ ఏడాది జాతరలో రికార్డు స్థాయిలో 788 హుండీలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ భారీ మొత్తాన్ని లెక్కించేందుకు సుమారు 10 రోజుల సమయం పట్టే అవకాశం ఉంది. లెక్కింపు పారదర్శకంగా జరిగేలా మొత్తం ప్రాంతాన్ని 20 సీసీ కెమెరాల నిఘాలో ఉంచారు. దేవాదాయ శాఖకు చెందిన 200 మంది అధికారులు, సుమారు 300 మంది వాలంటీర్లు ఈ లెక్కింపులో పాల్గొంటున్నారు.

## - ప్రజా సేవకే నిధుల వినియోగం

ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. భక్తులు సమర్పించిన కానుకలను మేడారం క్షేత్ర అభివృద్ధికి, భక్తుల సౌకర్యార్థం మరిన్ని మౌలిక వసతులు కల్పించేందుకు వినియోగిస్తామని చెప్పారు. పారదర్శకత కోసం బ్యాంకు అధికారులు, పోలీస్ నిఘా మధ్య లెక్కింపు కొనసాగుతోందని వివరించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ సునీత, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పల్లెలకు 'కేంద్ర' ఊరట

- రూ. 259 కోట్ల నిధులు విడుదల
- 15వ ఆర్థిక సంఘం నిధులకు లైన్ క్లియర్



అక్షరదర్బార్, హైదరాబాద్ : తెలంగాణలోని గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. సుదీర్ఘ కాలంగా నిలిచిపోయిన 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేస్తూ కేంద్ర ఆర్థిక శాఖ గురువారం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. తొలి విడతగా రాష్ట్రానికి రూ. 259.36 కోట్ల నిధులను మంజూరు చేసింది. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి పనులకు ఈ నిధులు వెన్నుముకగా నిలవనున్నాయి. రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలు సకాలంలో నిర్వహించకపోవడంతో గత రెండేళ్లుగా ఈ నిధుల విడుదల నిలిచిపోయింది. కేంద్ర నిబంధనల ప్రకారం.. ప్రజలచే ఎన్నికైన పాలకవర్గాలు ఉన్నప్పుడే ఆర్థిక సంఘం నిధులు నేరుగా పంచాయతీ ఖాతాల్లో జమ అవుతాయి. ఇటీవలే రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు విజయవంతంగా ముగిసి, కొత్త పాలకవర్గాలు బాధ్యతలు చేపట్టడంతో నిధుల విడుదలకు ఉన్న ఆటంకాలు తొలగిపోయాయి.

## - మార్గం సుగమం

పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క నిధుల విడుదల కోసం నిరంతరం కేంద్రంతో సంప్రదింపులు జరిపారు. ఢిల్లీ పర్యటనల్లో కేంద్ర మంత్రులను కలిసి గ్రామాల ఆర్థిక పరిస్థితిని వివరించడం, పంచాయతీ రాజ్ శాఖ ఉన్నతాధికారులు సాంకేతిక ప్రక్రియను వేగవంతం చేయడంతో ఈ నిధులు విడుదలయ్యాయి. 15వ ఆర్థిక సంఘం సిఫారసుల ప్రకారం తెలంగాణకు కేంద్రం నుంచి మొత్తం రూ.3,000 కోట్ల వరకు నిధులు అందాల్సి ఉంది. ప్రస్తుతం విడుదలైన రూ.259.36 కోట్లు కేవలం తొలి విడత మాత్రమేనని అధికారులు తెలిపారు. మిగిలిన పెండింగ్ నిధులను కూడా మార్చి 31లోగా దశలవారీగా విడుదల చేయాలని మంత్రి సీతక్క కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. కొత్తగా ఎన్నికైన సర్పంచులు తమ గ్రామాల్లో పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా, వీధి దీపాల వంటి అత్యవసర పనుల కోసం ఈ నిధులను వినియోగించుకోవచ్చని ప్రభుత్వం తెలిపింది.



# శివరాత్రి మహోత్సవాలకు సహకరిస్తాం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- శివరాత్రి మహోత్సవ గోడపత్రిక ఆవిష్కరణ

అక్షరదర్బార్, గణపురం: ప్రసిద్ధిగాంచిన చారిత్రక సంపద కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్లలో ఈనెల 15 ఆదివారం నిర్వహించే శివరాత్రి మహోత్సవాలకు తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గురువారం కోటగుళ్ళు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్యక్రమ గోడపత్రికను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15, 16 ,17 తేదీల్లో నిర్వహించే కార్యక్రమాలకు తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామని ఈ సందర్భంగా అన్నారు. అనంతరం ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు వారిని శాలువాలు పూలమాలతో ఘనంగా సన్మానించి ఆశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలోట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయితే ప్రకాష్ రెడ్డి , గణపురం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కట్కూరి రాధిక శ్రీనివాస్, కోట గుళ్ళు పరిరక్షణ కమిటీ గౌరవ అధ్యక్షులు మామిండ్ల మల్లికార్జున్ గౌడ్, చెల్పూర్ సొసైటీ చైర్మన్ గండ్ర సత్యనారాయణరెడ్డి, రాజ్ కుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రేపాక రాజేందర్, మాజీ వైస్ ఎంపీపీ విడిదినేని అశోక్, గాంధీనగర్ సర్పంచ్ ఇంజపెల్లి శ్రీనివాస్, మాజీ కోఆప్షన్ సభ్యులు ఎండి చోటెమియా, లింగంపల్లి వేణుగోపాలరావు పాల్గొన్నారు.

# చెక్ పోస్టులను తనిఖీ చేసిన డీసీపీ




అక్షరదర్బార్, హనుమకొండ: మున్సిపల్ ఎన్నికలను పురస్కరించుకొని పరకాల మున్సిపాలిటీ సరిహద్దుల్లో నాలుగు స్టాటిక్ సర్వ లైన్స్ టీంలతో హన్మకొండ, హుజురాబాద్, చలివాగు బ్రిడ్జ్, వెల్లంపల్లి మార్గాల్లో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్టులను ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్న తీరుపై డీసీపీ చెక్ పోస్ట్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తనిఖీ కేంద్రాల్లో వివరాలను పరిశీలించారు. డీసీపీ వెంట పరకాల ఏసీపీ సతీష్ బాబు, ఇన్ స్పెక్టర్ క్రాంతికుమార్ ఉన్నారు.

# మేడారంపై సీఎంవో నజర్

- సీఎంఓ ప్రిన్సిపల్ సెక్రటరీ పరిశీలన
- కలెక్టర్, ఎస్పీలతో కలిసి వీవీఐపీ రూట్, పార్కింగ్ స్థలాల తనిఖీ

అక్షరదర్బార్, తాడ్వాయి : ప్రసిద్ధ మేడారం సమ్మక్క–సారలమ్మ మహా జాతర భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి కార్యాలయ ప్రిన్సిపల్ సెక్రటరీ కేవిఎస్ శ్రీనివాసరాజు గురువారం మేడారంలో పర్యటించారు. జాతర ముగిసిన నేపథ్యంలో క్షేత్రస్థాయిలో ఎదురైన ఇబ్బందులను విశ్లేషించి, శాశ్వత పరిష్కారాల దిశగా అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ పర్యటనలో ఆయన జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్., ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్ లతో కలిసి వీవీఐపి వాహనాలు వచ్చే రహదారిని, పార్కింగ్ స్థలాలను, తాత్కాలిక ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. 2026 జాతరలో భక్తుల రద్దీని నియంత్రించడంలో ఎదురైన సమస్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.




## - వచ్చే జాతరకు పకడ్బందీ కసరత్తు

ఈ సందర్భంగా శ్రీనివాసరాజు మాట్లాడుతూ.. 2026 మహా జాతర అనుభవాలను ప్రామాణికంగా తీసుకుని 2028 జాతర నాటికి ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. జాతర సమయంలో తలెత్తిన సమస్యలు పునరావృతం కావొద్దు. భక్తులకు మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పించేలా ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందించాలి. ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్, ఆర్టీసీ శాఖలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు.

# ఔదార్యం చాటుకున్న పదవ తరగతి మిత్రులు

అక్షర దర్బార్, శాయంపేట : కష్టాల్లో ఉన్న స్నేహితుడికి 1995–96 ఎస్ఎస్సీ బ్యాచ్ మిత్రులు ఆర్థిక చేయూత అందించారు. శాయంపేట మండలం పెద్దకోడెపాక గ్రామానికి చెందిన తమ సహచర మిత్రుడు దూలం శ్రీనివాస్ తల్లి సమ్మక్క ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో, మరణవార్త తెలుసుకున్న పాఠశాల పూర్వ విద్యార్థులు శ్రీనివాస్ ని పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో 1995–96 బ్యాచ్‌కు చెందిన అన్న మహేందర్, కోగిల భిక్షపతి, చంద్రమౌళి, కుమారస్వామి, పైండ్ల శంకర్, వావిళ్ళ తిరుపతి, బుస్స శ్రీనివాస్, ములుకనూరి చంద్రమౌళి, డెంగు సంజీవరావు, రాసమళ్ళ వెంకట్ పాల్గొన్నారు.



## ఎదిర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ డే

అక్షర దర్బార్, నూగూరు వెంకటాపురం : నూగూరు వెంకటాపురం మండలంలోని ఎదిర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో ఆశా డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తల నెలవారీ నివేదికలను పరిశీలించారు. జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమం 'స్పర్శ'ను జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13 వరకు నిర్వహించాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.




## సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

### సూరవీడు సర్పంచ్ ఇర్ప మురళి

అక్షర దర్బార్, నూగూరు వెంకటాపురం : నూగూరు వెంకటాపురం మండలం సూరవీడు గ్రామపంచాయతీలోని పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలను సర్పంచ్ ఇర్ప మురళి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేసిన ఆయన, డైనింగ్ హాల్, తాగునీరు, విద్యుత్ సదుపాయం, కాంపౌండ్ వాల్ ఫెన్సింగ్, నూతన అంగన్వాడీ మంజూరు వంటి సమస్యలను గమనించారు. ఈ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని సర్పంచ్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కోర్స మురళీకృష్ణ, పాలకవర్గ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




## ప్రజలే నా బలం..

### సీపీఎం అభ్యర్థి బొచ్చు విజయ

అక్షర దర్బార్, పరకాల: పరకాల మున్సిపాలిటీ ఎన్నికల్లో రెండో వార్డు నుంచి సీపీఎం అభ్యర్థిగా పోటీ చేస్తున్న బొచ్చు విజయ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు ప్రజలే తన అసలైన బలమని, వార్డు అభివృద్ధే తమ జయానికి మార్గమని ధీమా వ్యక్తం చేశారు. రెండో వార్డులో రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, తాగునీటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తాను గెలిస్తే రెండో వార్డు అభివృద్ధికి అంకితభావంతో పని చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బొట్ల చక్రపాణి, పరకాల పట్టణ కార్యదర్శి బొచ్చు కళ్యాణ్, మడికొండ ప్రశాంత్, బొచ్చు ఈశ్వర్, సాల్మన్ రాజ్, సన్నీ, శాంతి కుమా పాల్గొన్నారు.



# ధాన్యంలో 'సివిల్' దందా

- భూపాలపల్లి జిల్లాలో వసూళ్ల పర్వం!
- ధాన్యం కేటాయింపుల్లో ఓ అధికారి హస్తవాటం.. 'లక్ష'ణంగా ముడుపులు
- రూపాయి పేరుతో వసూళ్లకు తెరలేపిన ఇద్దరు మిల్లర్లు
- ఓ డిఫాల్ట్ రైస్ మిల్లులో దిగిన ప్రభుత్వ ధాన్యం!

అక్షరదర్బార్, హనుమకొండ : ప్రభుత్వ ఆశయాలకు కొందరు అధికారులు తూట్లు పొడుస్తున్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు కేటాయించే ప్రక్రియలో అక్రమ సంపాదనకు తెరలేపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా పౌరసరఫరాల శాఖలో వెలుగు చూసిన ఈ 'ముడుపుల' వ్యవహారం ఇప్పుడు జిల్లాలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇటీవల ఖరీఫ్ సీజన్‌లో కొనుగోలు చేసిన ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కోసం జిల్లాలోని వివిధ రైస్ మిల్లులకు కేటాయించారు. అయితే, తమకు అనుకున్న రీతిలో ధాన్యం రాదని భావించిన కొందరు రైస్ మిల్లర్లు పౌరసరఫరాల శాఖలోని ఒక కీలక అధికారిని ఆశ్రయించారు. తమకు సరిపడా ధాన్యం కేటాయిస్తే భారీగా ముట్టజెపుతామని ఆఫర్ ఇవ్వగా, సదరు అధికారి కూడా ఇందుకు పచ్చజెండా ఊపినట్లు సమాచారం.



### - వసూళ్ల పర్వం.. రూపాయి పేరుతో దందా

ఈ వ్యవహారంలో రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌లోని ఇద్దరు సభ్యులు మధ్యవర్తిత్వం వహించినట్లు తెలుస్తోంది. ఒక్కో రైస్ మిల్లు నుంచి రూ.లక్ష ఇవ్వాలని, దానికి కోడ్ భాషలో 'రూపాయి' అని పేరు పెట్టి వసూళ్లకు దిగారు. జిల్లాలోని సుమారు 30 రైస్ మిల్లుల నుంచి ఒక్కో మిల్లుకు రూ.లక్ష చొప్పున వసూలు చేసి, సదరు అధికారికి అందజేసినట్లు సమాచారం.

### - డిఫాల్ట్ మిల్లులో ధాన్యం దిగుమతి

ఈ వసూళ్ల పర్వంలో మరో విస్తుపోయే నిజం వెలుగులోకి వచ్చింది. గతంలో ప్రభుత్వానికి ధాన్యం అప్పగించడంలో విఫలమై 'డిఫాల్ట్' జాబితాలో ఉన్న ఒక మిల్లుకు కూడా ముడుపులు అందిన కారణంగా ధాన్యం కేటాయించినట్లు తెలుస్తోంది. వేరొక మిల్లర్ పేరుతో ఈ డిఫాల్ట్ మిల్లులో ప్రభుత్వ ధాన్యాన్ని దిగుమతి చేసుకున్నప్పటికీ, సదరు అధికారి చూసీచూడనట్లు వ్యవహరించడం వెనుక ఉన్న 'కాసుల' మాయాజాలం ఇప్పుడు అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

## బాల కుమారస్వామి దేవాలయంలో మంత్రి సీతక్క ప్రత్యేక పూజలు

అక్షర దర్బార్, ములుగు జిల్లా ప్రతినిధి : ములుగు జిల్లా ములుగు మండలం అంకన్నగూడెం గ్రామంలోని బాల కుమారస్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న జాతరలో మంత్రి సీతక్క పాల్గొన్నారు. మహిళలతో కలిసి ఆదివాసీ సంప్రదాయ నృత్యం చేసి అనంతరం బాల కుమారస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సమ్మక్క సోదరుడిగా బాల కుమారస్వామిని కొలుస్తారని, జాతర సంప్రదాయంగా ఘనంగా నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం దేవాలయ మరమ్మత్తు పనులను ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి



రూ.5 లక్షల అంచనా వ్యయంతో ప్రారంభించారు.

## 3వ వార్డులో బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం

### సృజన సుమంత్ ను భారీ మెజారిటీతో గెలిపించాలి : చల్లా ధర్మారెడ్డి

అక్షర దర్బార్, పరకాల : పరకాల మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో 3వ వార్డులో బీఆర్ఎస్ అభ్యర్థి పంచగిరి సృజన సుమంత్‌కు మద్దతుగా మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కారు గుర్తుకు ఓటు వేసి సృజన సుమంత్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. పరకాల అభివృద్ధి బీఆర్ఎస్ పాలనలోనే సాధ్యమైం




దని పేర్కొన్నారు. ప్రచారంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## మున్సిపల్ గెలుపు రేసులో పవన్ నాయక్

### 3వ వార్డులో బీఆర్ఎస్ జోరుగా ప్రచారం

అక్షర దర్బార్, కేసముద్రం : మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కేసముద్రం పట్టణంలోని 3వ వార్డులో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బాదావత్ పవన్ నాయక్ ప్రచారం జోరుగా సాగుతోంది. బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు. విద్యావంతుడు, యువ నాయకుడైన పవన్ నాయక్ అనేక సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు చేరువయ్యారని స్థానికులు పేర్కొంటున్నారు. ఎవరికి ఏ ఆపద వచ్చినా వెంటనే స్పందించే వ్యక్తిగా గుర్తింపు ఉందని మేధావులు తెలిపారు. 3వ వార్డు కౌన్సిలర్‌గా గెలిస్తే నిరుపేదలకు న్యాయం చేస్తాడని ప్రజలు విశ్వసిస్తున్నారు. పవన్ నాయక్ వెంటే మేమందరమంటూ వార్డులో ఉత్సాహంగా ప్రచారం సాగుతోంది.

## మృతుల కుటుంబాలకు మాజీ జెడ్పీటీసీ సాగర్ పరామర్శ

అక్షర దర్బార్, చిట్యాల : చిట్యాల మండలంలో ఇటీవల మరణించిన వారి కుటుంబాలను మాజీ జెడ్పీటీసీ గొర్రె సాగర్ యాదవ్ పరామర్శించారు. మండలంలోని అందుగుతండ గ్రామానికి చెందిన కీ.శే. భనోత్ మంగ్తె నాయక్, గుటూరుపల్లి గ్రామానికి చెందిన నిమ్మగడ్డ కార్తీక్ కుటుంబాలను ఆయన సందర్శించి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అల్లం రవీందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ పిట్ట సురేష్ బాబు పాల్గొన్నారు.



# ఆధునిక టెక్నాలజీతో పోయిన ఫోన్ రికవరీ

**నలుగురు బాధితులకు ఫోన్లు అందజేసిన చిట్యాల ఎస్సై**

అక్షర దర్బార్, చిట్యాల : పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రికవరీ చేయవచ్చని చిట్యాల ఎస్సై శ్రావణ్ కుమార్ తెలిపారు. గురువారం తమ ఫోన్లు పోగొట్టుకున్న నలుగురు బాధితులకు రికవరీ చేసిన సెల్‌ఫోన్లను ఆయన అందజేశారు. ఆగస్టు 2024లో పోగొట్టుకున్న వివో T5 ప్రో, రెడ్మి నోట్ 12 ప్రో, ఒప్పో మొబైల్ ఫోన్లను CEIR పోర్టల్ ద్వారా ట్రాక్ చేసి రికవరీ చేసినట్లు తెలిపారు. కానిస్టేబుల్ లాల్ సింగ్ సహకారంతో ఈ ఫోన్లను గుర్తించామని చెప్పారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వారు వెంటనే పోలీస్ స్టేషన్‌లో లేదా CEIR పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఇతరుల మొబైల్ ఫోన్లను అక్రమంగా వినియోగించడం నేరమని హెచ్చరించారు. ఫోన్లు తిరిగి పొందిన బాధితులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

భీమదేవరపల్లి, అక్షర దర్బార్ : అనారోగ్య సమస్యలతో మనస్తాపం చెందిన ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామంలో జరిగింది. ముల్కనూర్ ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపల్లి కుమారస్వామి (36) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పలు ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్నప్పటికీ ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో తన వ్యవసాయ బావి వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటికి పెద్దదిక్కుగా ఉన్న కుమారుడి మృతి వార్త విని తల్లి రాజమ్మ రోదన చూసి గ్రామస్తులు కంటతడి పెట్టారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



# డ్రగ్, సైబర్ క్రైమ్ రహిత సమాజానికి పాడుపడాలి

అక్షర దర్బార్, శాయంపేట : శాయంపేట మండలం కాట్రపల్లిలోని సియస్‌ఐ బిజెయం ఉన్నత పాఠశాలలో డ్రగ్ రహిత, సైబర్ క్రైమ్ రహిత సమాజ నిర్మాణంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ హరి బ్రహ్మాచారి, హెడ్ కానిస్టేబుల్ రవీందర్ పాల్గొని విద్యార్థులకు సూచనలు చేశారు. ప్రతి ఇంట్లో మొబైల్ ఫోన్ వినియోగం పెరిగిందని, దాన్ని సరిగా వినియోగించకపోతే దుష్పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ అనిల్ కుమార్ మాట్లాడుతూ సమాజంలో మార్పు విద్యార్థి దశ నుంచే ప్రారంభమవుతుందని తెలిపారు. తల్లిదండ్రుల సూచనలు, ఉపాధ్యాయుల మార్గనిర్దేశం పాటించాలని సూచించారు.

# కాంగ్రెస్ అభ్యర్థులను ఆశీర్వదించండి

**ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు**



అక్షర దర్బార్, భూపాలపల్లి : మున్సిపల్ ఎన్నికల్లో 9, 10వ వార్డులలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పిలుపునిచ్చారు. గురువారం ఎన్నికల ప్రచారంలో భాగంగా భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని మహబూబ్‌పల్లి, కుందూరుపల్లి, పుల్లూరిరామయ్యపల్లిలో సీపీఐ, సీపీఐ(ఎం) మద్దతుతో పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థుల తరఫున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్నర్ మీటింగ్స్‌లో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు, సన్నబియ్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఉచిత బస్ ప్రయాణం వంటి పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. 9, 10వ వార్డుల్లో మౌలిక సదుపాయాల కోసం నిధులు వెచ్చించినట్లు చెప్పారు.

# కాంగ్రెస్ మోసాలే ఆ పార్టీ పతనానికి కారణం

**బీఆర్ఎస్ నేతలు ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, చల్లా**



అక్షర దర్బార్, పరకాల : పరకాల మున్సిపాలిటీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు ఖాయమని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం పట్టణంలోని 6, 7, 8, 9, 10, 11, 20, 21వ వార్డుల్లో ఇంటింటి ప్రచారం, స్ట్రీట్ కార్నర్ మీటింగ్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, మాజీ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవ రెడ్డి పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేస్తోందని, ఇచ్చిన హామీల్లో ఒక్కటైనా అమలు కాలేదని విమర్శించారు. పరకాల అభివృద్ధి బీఆర్ఎస్ పాలనలోనే జరిగిందని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వాలని ప్రజలను కోరారు.



# గులాబీ జోరు

**14వ వార్డులో దీప్తి-రాకేష్ రావు సుడిగాలి పర్యటన**

అక్షర దర్బార్, పరకాల :పరకాల మున్సిపాలిటీ 14వ వార్డులో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కొక్కిరాల దీప్తి–రాకేష్ రావు గెలుపే లక్ష్యంగా సుడిగాలి పర్యటన నిర్వహించారు. ఇంటింటి ప్రచారానికి వార్డు ప్రజలు మంగళహారతులతో స్వాగతం పలికారు.ఈ సందర్భంగా అభ్యర్థులు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే బీఆర్ఎస్ విధానమని పేర్కొన్నారు.

# జిల్లా స్థాయి చెస్ పోటీలకు లవణ్ బాబు

అక్షర దర్బార్, చిట్యాల : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సీఎం కప్ టోర్నమెంట్‌లో భాగంగా చిట్యాల మండల స్థాయి చెస్ పోటీల్లో మాటూరి లవణ్ బాబు విజేతగా నిలిచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. మండల కేంద్రానికి చెందిన లవణ్ బాబు చెస్ టోర్నీలో ప్రతిభ చూపి మొదటి స్థానంలో నిలిచారని మండల విద్యాశాఖ అధికారులు తెలిపారు. జిల్లా స్థాయి పోటీల్లో కూడా ఉత్తమ ఫలితాలు సాధించాలని అధికారులు అభినందించారు.







# పరకాల గడ్డపై కాంగ్రెస్ కు ప్రజల ఆశీర్వాదం

**దళితులపై మాట్లాడే హక్కు ఆర్ఎస్ ప్రవీణ్ కు లేదు :ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి**

అక్షర దర్బార్, పరకాల : పరకాల గడ్డపై కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. గురువారం మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో భాగంగా 12వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి కొడెల మౌనిష దిలీప్, 21వ వార్డు అభ్యర్థి సూదమల్ల రమేష్ గెలుపు కోసం మాజీ ఎమ్మెల్యే మొలుగూరి బిక్షపతితో కలిసి ఆయన విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రణాళికాబద్ధంగా పరకాల పట్టణాన్ని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. దళితుల గురించి మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు లేదని విమర్శించారు. గత బీఆర్ఎస్ పాలనలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సంఖ్యను వెల్లడించాలని ప్రశ్నించారు. దళితులకు మూడెకరాల భూమి, దళిత సీఎం వంటి హామీలతో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని ఆరోపించారు. పరకాల సమగ్ర అభివృద్ధికి కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.



# పూర్ణచారికి 9వ వార్డు ప్రజల ఆశీర్వాదం

**సేవకుడిగా వచ్చాను.. అభివృద్ధే లక్ష్యం : పూర్ణ చారి**

అక్షర దర్బార్, పరకాల : పరకాల పట్టణంలోని 9వ వార్డు బీజేపీ అభ్యర్థి, తాజా మాజీ కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణ చారి గురువారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలు ఘన స్వాగతం పలుకుతూ మద్దతు తెలిపారు. గతంలో కాలనీ అభివృద్ధి కోసం చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ, "ఎంతమంది వచ్చినా పూర్ణచారికే మా ఓటు" అంటూ ప్రజలు అభిమానం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పూర్ణ చారి మాట్లాడుతూ రాజకీయాల కోసం కాకుండా కాలనీ సేవకుడిగా ముందుకు వస్తున్నానని చెప్పారు. మళ్లీ గెలిపిస్తే 9వ వార్డు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రచారంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వీరేష్ కు ఓటేద్దాం.. అభివృద్ధికి బాటేద్దాం

అక్షర దర్బార్, కేసముద్రం : విద్యావంతుడు, బీ-ఫార్మసీ చదివిన తరాల వీరేష్ యాదవ్‌కు ఓటు వేసి అభివృద్ధికి బాటలు వేయాలని 12వ వార్డు ప్రజలు చర్చించుకుంటున్నారు. వీరేష్ తన వార్డులో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు మరింత చేరువయ్యారని స్థానికులు పేర్కొంటున్నారు. ఆపదలో ఉన్నవారు తన వద్దకు వస్తే భరోసా ఇచ్చే వ్యక్తిగా వీరేష్ పేరు తెచ్చుకున్నారని మేధావులు అభిప్రాయపడుతున్నారు. 12వ వార్డు కౌన్సిలర్‌గా గెలిపించి మున్సిపాలిటీలో అవకాశం ఇస్తే నిరుపేదలకు న్యాయం చేస్తాడని ప్రజలు విశ్వసిస్తున్నారు. నాయకుడంటే సేవకుడని వీరేష్‌ను చూస్తే అర్థమవుతుందని ఓటర్లు అంటున్నారు. వీరేష్ అన్న వెంటే మేమున్నామంటూ వార్డులో జోరుగా ప్రచారం కొనసాగుతోంది. ప్రజల భాగస్వామ్యాన్ని చూస్తే వీరేష్ గెలుపు ఖాయమన్న భావన వ్యక్తమవుతోంది.






# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

*డిజిటల్ విప్లవంలో భాగంకండి!*

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

# మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI N0.TELTEL/2022/81915